
సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 3 । మే । 2025



వైభవంగా ఉత్సవాలు

యాదగిరి క్షేత్రంలో ఈనెల 9నుంచి శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. - 10లో



ఆర్టీసీలో ఆన్‌లైన్ పేమెంట్

చిల్లర సమస్యను అధిగమించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. - 10లో

గరిష్టం/కనిష్టం 41° /26°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

15న సుందరీమణుల రాక

సాక్షి,యాదాద్రి : వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు ఈనెల 15న జిల్లా సందర్శనకు రానున్నారని, ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా ఈనెల 7నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి వస్తున్నారని, తమ పర్యటనలో భాగంగా యాదాద్రి జిల్లాను సందర్శిస్తారని వెల్లడించారు. 15వ తేదీన సాయంత్రం భూదాన్‌పోచంపల్లి రూరల్ టూరిజంపార్క్‌కు 30 మంది, యాదగిరిగుట్టకు 30 మంది వస్తారని పేర్కొన్నారు. పోచంపల్లిలో చేనేత ఇక్కత్ వస్త్రాల తయారీని పరిశీలిస్తారని, యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం దర్శనంతోపాటు కొండపైన ప్రత్యేక ప్రాంతాలను సందర్శిస్తారని చెప్పారు. అదేరోజు రాత్రి తిరిగి హైదారాబాద్ వెళ్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, టెన్త్ ఫలితాలే నిదర్శనమన్నారు.

అట్రాసిటీ కేసులపై సమీక్ష

భువనగిరి టౌన్ : కలెక్టరేట్‌లో శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ఎమ్మెల్యే సమీక్షించారు. పరిష్కారంపై అధికారులతో చర్చించారు. ప్రతి నెలా అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట ఏసీపీలు, కమిటీ సభ్యులు సుదర్శన్, శివలింగం, నర్సింగరావు, తిరుమలేష్, రాజునాయక్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఐలయ్య



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజభవన్‌లో కలిశారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన బిల్లుకు ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం తెలిపి రాష్ట్రపతికి పంపడంతో గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందన్నారు.

8,162 ఇళ్లు మంజూరు

భువనగిరిటౌన్ : జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 8,932 ఇందిరమ్మ ఇళ్లకు గాను ఇప్పటి వరకు 8,162 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్, డీఈలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ హేమిమా తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. ఈ నెల 1నుంచి 31వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేసేందుకు ఆ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టేక్ హోం రేషన్ ద్వారా గుడ్లు, సరకులు సరఫరా చేయనున్నారు. జిల్లాలోని 901 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 24 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇక అంగన్‌వాడీ టీచర్లకు 15 రోజులు, ఆయాలకు 15 రోజుల చొప్పున సెలవులు ఉండనున్నాయి. మిగతా రోజుల్లో ఇంటింటి సర్వే, చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పడానికి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో వేసవి నుంచి లబ్ధిదారులకు, సిబ్బందికి ఉపశమనం కలిగినట్లయింది.

మూడు నెలలే గడువు

పనులేమో కదలవు!

ఆరేళ్లు గడిచినా పూర్తికాని ఆర్‌యూబీ



ఆలేరు పట్టణంలోని రైల్వే గేట్ వద్ద పూర్తికాని అండర్ బ్రిడ్జి పనులు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- చుట్టూ తిరిగి వెళ్లలేక రైలు పట్టాల పైనుంచే పోతున్న ప్రజలు
- రూ.13 కోట్ల వ్యయంతో పనులు

ఆలేరు: ఆవలి వైపు వెళ్లడానికి పట్టుమని పది మీటర్ల దూరం ఉండదు. కానీ, రెండు కిలోమీటర్ల ప్రయాణిస్తే తప్ప అక్కడికి చేరుకోలేం. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో రైల్వేగేట్ స్థానంలో చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణంలో జరుగుతున్న జాప్యం వల్ల పట్టణాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అగ్రిమెంట్ ప్రకారం మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ 60 శాతం కూడా పనులు పూర్తికాలేదు.

2019 అక్టోబర్‌లో పనులు మొదలు

ఆలేరు రైల్వే లెవల్ క్రాసింగ్(గేట్) మీదుగా హైదరాబాద్ - వరంగల్‌ల మధ్య రైళ్ల రాకపోకల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ నిత్యం గేట్ పడటం వల్ల ప్రజలు ఆర్‌ఓబీ మీదుగా 2కి.మీ చుట్టూ తిరిగి పట్టణంలోకి రావాల్సిన పరిస్థితి. నాయకులు, స్థానిక ప్రజలు ఆందోళన నేపథ్యంలో ఆర్‌యూబీ మంజూరైంది. 2019 అక్టోబర్‌లో పనులు ప్రారంభం అయ్యాయి. మొదట రూ.11కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే భూ నిర్వాసితులకు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉన్నందున ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.13 కోట్లకు పెంచారు.

అత్యవసర సమయంలో..

అంత్యక్రియలసమయంలో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం . రైల్వేగేట్ అవలి వైపు నుంచి హైదరాబాద్ మార్గంలోని శ్మశానవాటికకు పార్థీవదేహాన్ని తరలించడం, అక్కడికి కుటుంబ సభ్యులు రావడానికి ప్రయాస పడాల్సిన పరిస్థితి. అత్యవసర వైద్యసేవల కోసం గర్భిణులు, వృద్ధులు ఆస్పత్రికి వెళ్లడానికి కొన్ని సందర్భాల్లో జాప్యం జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అంబులెన్స్ చుట్టూ తిరిగి, పట్టణంలోకి రావడం, లేదా బాధితుని ఇంటికి వెళ్లడానికి ఆలస్యమవుతుందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవతోంది. తద్వారా సకాలంలో రోగులకు చికిత్స అందక ప్రాణాపాయ పరిస్థితులకు కారణమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆగస్టు లోపు పూర్తిచేస్తాం

వివేకానంద విగ్రహం నుంచి ఆర్‌యూబీ ప్రవేశ ద్వారం వద్ద 120 మీటర్ల పొడవు రిటైయినింగ్ వాల్ పనులు జరుగుతున్నాయి. వాహనాలు బయటకు వెళ్లే ద్వారం(ఎగ్జిట్) వద్ద 124 మీటర్ల పొడవుతో వాల్ పనులు పూర్తయ్యాయి. అయితే మిషన్‌భగీరథ, ఇతర పైప్‌లైన్లు ఉండడంతో పనులకు అడ్డంకి మారుతుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి పనులు పూర్తిచేసి ఆర్‌యూబీని అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

–కరుణాకర్, రైల్వే జేఈ

అందరికీ ఇబ్బందులే..



ఆర్‌యూబీ పనులు వేగవంతంగా జరగటం లేదు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో విద్యార్థులు, ఉద్యోగులు కార్యాలయాలకు, పింఛన్ల కోసం వృద్ధులు, ఇతర పనుల కోసం వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గడువులోపు పనులు పూర్తయ్యేలా అధికారులు శ్రద్ధ చూపాలి.

–తునికి దశరథ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, ఆర్‌యూబీ నిర్వాసితుల సమితి కన్వీనర్

ఈ ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది

ఆర్‌యూబీ ఆలస్యం వల్ల మున్సిపాలిటీలోని రామ్‌శివాజీనగర్, పోచ్చమ్మగుడి, రంగనాయకుల గుడి, శాంతినగర్, కుమ్మరి వాడ, ఎస్సీ కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బంది మారింది. అంతేకాకుండా రాజాపేట, రఘునాథపురం తదితర గ్రామాలకు ఇక్కడినుంచే వెళ్లాలి. ఆర్‌యూబీ పనుల్లో జాప్యం వల్ల అవస్థలు పడుతున్నారు.



ఆర్‌యూబీ ఎంట్రీ పాయింట్ వద్ద పునాది దశలోనే రిటైనింగ్ వాల్ నిర్మాణం



చేనేత సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వేదికపై చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి : చేనేతకు ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి కేంద్రీకృతంగానే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఇక్కత్ చేనేత సదస్సులో ఆయన మాట్లాడారు. రైతన్నలు, నేతన్నలు తమకు రెండు కళ్లని, వారి కష్టం, త్యాగాల వల్లనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల నుంచి నివేదిక రాగానే చేనేత కార్మికులకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులన్నా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. తన దృష్టికితీసుకొచ్చిన చేనేత సమస్యలను కేబినెట్‌లో పెట్టి, మరికొన్నింటిపై సీఎంను ఒప్పించి పరిష్కరించుటకు కృషిచేస్తానన్నారు. హ్యాండ్లూమ్ పార్కు లేదా స్వామిరామానందతీర్థ గ్రామీణసంస్థలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఐఐహెచ్‌టీకి ఆచార్య కొండాలక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టాలని సీఎం నిర్ణయించారని వెల్లడించారు. ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉన్న మండలాలతో పాటు భూదాన్‌పోచంపల్లి మండలానికి కూడా టెక్నికల్ సమస్యల వల్ల రైతుభరోసా ఆగిపోయిందని, వచ్చే రైతుభరోసాలో తప్పకుండా రైతులందరికీ ఖాతాలో డబ్బులు పడుతాయని, ఆందోళన చెందవద్దని కోరారు. అంతకుముందు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చేనేత సహకార సంఘాన్ని సందర్శించి చేనేత వస్త్రాలను పరిశీలించారు.

చేనేత సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా : ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

చేనేత సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాను కేంద్రంలోని చేనేత, జౌళిశాఖ కన్సంటెంట్ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని ఇటీవల పోచంపల్లి ఇక్కత్ డుప్లికేషన్‌పై పార్లమెంట్‌లో అడిగానని గుర్తు చేశారు. అదే మాదిరిగా కేంద్రం నుంచి రావల్సిన పథకాలు, నిధులు, పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుపై ఈ నెల 6న జరిగే సమావేశంలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌తో చర్చిస్తానని చెప్పారు.

నూలుడిపో ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పోచంపల్లిలో నూలు డిపో ఏర్పాటు చేయాలని, సహకార సంఘంతో పాటు సహకారేతర సంఘాల నుంచి కనీసం 25 శాతం చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని హ్యాండ్లూమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, ఏడీ శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేశం, అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత కార్మికసంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు కొట్టం కరుణాకర్‌రెడ్డి, రేఖాబాబురావు, పాక మల్లేశ్, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డీ అకౌంట్‌లో డబ్బులు జమ చేయండి

- చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్.



మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

చేనేత కార్మికులు త్రిఫ్ట్ పథకానికి సంబంధించి ఆర్‌డీ 1 అకౌంట్‌లో తమ వాటా ధనం జమచేసుకుంటే ప్రభుత్వం ఈ నెల 10నుంచి ఆర్‌డీ 2 అకౌంట్‌లో తన వాటా డబ్బులు జమచేస్తుందని చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. చేనేత బీమా కింద చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఇప్పటివరకు రూ.5 కోట్లు చెల్లించామన్నారు. సహకార సంఘాల ద్వారా రూ. 15 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశామని, ఇందులో యాదాద్రి జిల్లాలో రూ.4.50 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసి టెస్కో షోరూంల ద్వారా విక్రయిస్తున్నామని చెప్పారు. రెండు నెలల్లో రుణమాఫీ డబ్బులను కార్మికుల ఖాతాలో జమచేస్తామని, చేనేతవస్త్రాల డుప్లికేట్ నిరోధానికి తెలంగాణ లేబుల్ తీసుకొస్తున్నామని తెలిపారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో మ్యూజియం, డిజైనింగ్, డైయింగ్, ఎగ్జిబిషన్ అన్ని ఒకేదగ్గర ఏర్పాటు చేసేలా డీపీఆర్ తయారు చేస్తున్నామని చెప్పారు.

చేనేత సమస్యలపై వినతులు

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీతో పాటు చేనేత మెగాక్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని పోచంపల్లి చేనేత వర్గాల ఐక్యవేదిక నుంచి తడక వెంకటేశం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సహకారేతర సంఘాల నుంచి కూడా వస్త్రాలను కొనుగోలుచేయాలని, చేనేత వ్యాపారులకు ముద్ర రుణాలకు కోటి రూపాయల వరకు అందించాలని, ఇక్కత్ డిజైన్ల డూప్లికేట్‌ను అరికట్టాలని, కల్యాణలక్ష్మి పథకంలో నగదుతోపాటు పోచంపల్లి ఇక్కత్ చీర ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఆచార్యకొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కోరుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఫౌండర్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

మన దర్శకులకు ‘ఫాల్కే’ పురస్కారం

రజాకార్ సినిమా దర్శకుడు యాట సత్యనారాయణ, ‘యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్’ డాక్యుమెంటరీ దర్శకుడు విజయ్‌కుమార్‌ను వరించిన పురస్కారం



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకుంటున్న యాట సత్యనారాయణ

చిట్యాల, భూదాన్‌పోచంపల్లి : ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు సినీ దర్శకులు దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపికయ్యారు. చిట్యాల పట్టణానికి చెందిన యాట సత్యనారాయణ, భూదాన్‌పోచంపల్లికి చెందిన బడుగు విజయ్‌కుమార్‌లకు ఈ పురస్కారం దక్కింది. తెలంగాణలో జరిగిన రజాకార్ల దుశ్చర్యలపై, సాయుధ రైతాంగ గెరిల్లా పోరాటంపై రూపొందిన చిత్రానికి యాట సత్యనారాయణ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను భువనగిరి చెందిన బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి నిర్మించారు. మొదటిసారి దర్శకత్వం వహించిన వారి కేటగిరీలో యాట సత్యనారాయణ ఓ స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఎంపికయ్యారు. అదేవిధంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా భూదాన్‌పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు బడుగు విజయ్‌కుమార్ 'యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్; డాక్యుమెంటరీ చిత్రానికి ఉత్తమ దర్శకుడి కేటగిరీలో దాదాసాహెబ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఢిల్లీలో గురువారం రాత్రి జరిగిన దాదా సాహెబ్ ఫాల్కే15వ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 200 చిత్రాలను ప్రదర్శించగా 25 చిత్రాలు వివిధ కేటగిరీలలో పురస్కారానికి ఎంపికయ్యాయి. అందులో ఉత్తమ దర్శకులుగా యాట సత్యనారాయణ, బడుగు విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. యాట సత్యనారాయణ గురువారం రాత్రి జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లోనే పురస్కారం అందుకోగా.. బడుగు విజయ్‌కుమార్ శనివారం అందుకోనున్నారు.



దర్శకుడు బడుగు విజయ్‌కుమార్



యాట సత్యనారాయణ

ఈదురుగాలులు, వడగండ్లు





భువనగిరిలోని కోర్టు ఆవరణలో ప్రహరీ, కారుపై కూలిన వృక్షాలు

- భువనగిరి కోర్టు ఆవరణలో కూలిన చెట్లు
- మామిడి తోటల్లో రాలిన కాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

భువనగిరిటౌన్, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట రూరల్: భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి భువనగిరి పట్టణంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈదురుగాలులకు ఫ్లెక్సీలు కూలిపోయాయి. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయి సామగ్రి తడవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బంది పడ్డారు. జిల్లా కోర్టు ఆవరణలో ప్రహరీ కూలింది. చెట్లు విరిగిపడటంతో కారు ధ్వంసమైంది. కిసాన్‌నగర్‌లో విద్యుత్ స్తంభం కూలిపోయింది. మామిడి కాయలు నేలరాలాయి.

పోచంపల్లిలో అంధకారం

ఈదురుగాలుల వల్ల కరెంట్ సరఫరా నిలిచిపోయి పోచంపల్లి అంధకారంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. యాదగిరిగుట్ట మండలం గౌరా యపల్లిలో పాడి గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. అత్యధికంగా భువనగిరి 25, యాదగిరిగుట్టలో 23.3, బీబీనగర్‌లో 14 మి.మీ వర్షం కురిసింది.



భువనగిరిలో ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



వడగండ్లు

మరింత చేరువగా ‘రైతు నేస్తం’

- ప్రస్తుతం రైతువేదికల్లోనే ప్రసారం
- అదనంగా మండలానికి మరో రెండు క్లస్టర్లలో ఏర్పాటు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు



రామన్నపేట : రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటి వరకు మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ రైతులకు సాగులో అవసరమైన సలహాలు, సూచనలతో పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు గాను ప్రతి మండలంలో కొత్తగా రెండు వ్యవసాయ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా అధికారులు సిద్ధం చేశారు.

రైతునేస్తం ఉద్దేశం ఇదీ..

వ్యవసాయంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమం ప్రారంభించింది. రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్‌ను అనుసంధానం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, అభ్యుదయ రైతుల ద్వారా తరగతులు నిర్వహించి పంటల సాగు, మెళకువలు, యాజమాన్య పద్ధతులను, చీడపీడల నివారణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నూతన వ్యవసాయ సమాచారం చేరవేయడం జరుగుతుంది. డిజిటల్ ప్లాట్‌పామ్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎంతగానో దోహదపడుతుండడంతో రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులకు మరింత చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నారు. మొదటి దశలో మండలానికి ఒక రైతు వేదికను ఎంపిక చేయగా.. అదనంగా రెండు క్లస్టర్లకు విస్తరిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రతి ఐదువేల ఎకరాలకు ఒకటి చొప్పున 92 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి.

రైతునేస్తం ప్రసారం జరుగుతున్న రైతువేదికలు ఇవీ..

రాజాపేట, గుండాల, వలిగొండ, అడ్డగూడూరు, కొలనుపాక, ఆత్మకూర్(ఎం), అనాజిపురం, రాయరావుపేట, బొమ్మలరామారం, జైకేసారం, చాడ, పాటిమట్ల, మాదాపురం, సంస్థాన్‌నారాయణపురం, బీమనపల్లి, రామన్నపేట, మాసాయిపేటలోని రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

అదనంగా ఎంపిక చేసిన గ్రామాలు మండలాల వారీగా..

- **అడ్డగూడూరు :** గట్టు సింగారం, చౌళ్లరామారం
- **ఆలేరు :** గుండ్లగూడెం, గొలనుకొండ
- **ఆత్మకూరు(ఎం) :** పల్లెర్ల, కప్రాయిపల్లి
- **గుండాల :** బ్రాహ్మణపల్లి, వెల్మజాల
- **మోత్కూరు :** దత్తప్పగూడెం, మోత్కూరు
- **పోచంపల్లి :** పెద్దరావులపల్లి, జలాల్‌పూర్
- **భువనగిరి :** మానుకుంట(భువనగిరి), చందుపట్ల
- **బీబీనగర్ :** పడమటి సోమారం, బీబీనగర్
- **వలిగొండ :** వెలువర్తి, పొద్దుటూరు
- **చౌటుప్పల్ :** చౌటుప్పల్, పంతంగి
- **నారాయణపురం :** జనగాం, పుట్టపాక
- **రామన్నపేట :** వెల్లంకి, తుమ్మలగూడెం (ఇంద్రపాలనగరం)
- **బొమ్మలరామారం :** మర్యాల, మైలారం
- **మోటకొండూరు :** చండేపల్లి, మాటూరు
- **రాజాపేట :** పాముకుంట, బొందుగుల
- **తుర్కపల్లి :** తుర్కపల్లి, వీరారెడ్డిపల్లి
- **యాదగిరిగుట్ట :** వంగపల్లి, సైదాపూర్

రైతులకు మరింత ప్రయోజనం



రైతునేస్తం అద్భుతమైన కార్యక్రమం. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సాగు పద్ధతులను తెలియజేయడంతో పాటు రైతులతో ముఖాముఖి చర్చించి వారి సందేహాలను నివృత్తి చేసే వేదిక. అభ్యుదయ రైతుల అనుభవాలు చూడడం ద్వారా రైతుల్లో సేత్యంపై నమ్మకం పెరుగుతుంది. నూతనంగా ఎంపిక చేసిన రైతువేదికల్లో త్వరలో రైతునేస్తం సేవలు అందుబాటులోకి వస్తాయి. రాబోయే రోజుల్లో రైతులకు మరింత మేలు జరుగుతుంది.

–గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

డిండి: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం డిండి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. డిండి పట్టణానికి చెందిన కాసుల వెంకటేష్ చారి ఇంటికి తాళం వేసి గత నెల 30న మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు వెంకటేష్ చారి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం తవక్లాపూర్ నుంచి ఇంటికి తిరిగొచ్చిన వెంకటేష్ తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చోరీ ఘటనపై వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కొండమల్లేపల్లి : కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామ పంచాయతీకి చెందిన చెనమోని సత్యం(53) బైక్‌పై తిరుగుతూ చేపలు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని సంజీవని ట్రస్ట్ వద్దకు రాగానే పెద్దవూర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అదుపు తప్పి సత్యం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

చోరీ నిందితులకు రిమాండ్


నిందితులను చూపుతున్న పోలీసులు

కేతేపల్లి : చోరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని అమ్మేందుకు హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా కేతేపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌పై ఇద్దరు యువకులు సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా కొర్లపహాడ్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుపడ్డారు. వారిని స్టేషన్ తీసుకెళ్లి విచారించగా సూర్యాపేట పట్టణం సీతారామపురం గ్రామానికి చెందిన కంభం కుమార్, మనబోలు లక్ష్మీనర్సింహాగా గుర్తించారు. వీరు గత ఫిబ్రవరిలో కొప్పోలు గ్రామంలో బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి బైక్‌ను రికవరీ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు

పెన్‌పహాడ్ : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్షతో పాటు రూ. 2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన మేడం రమణయ్య శుక్రవారం మద్యం సేవించి వాహనాన్ని నడుపుతుండగా పోలీసులు తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి వెంకటరమణ ఎదుట హాజరుపరిచారు. దీంతో అతడికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ పేమెంట్

- అందుబాటులోకి రానున్న ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లు (ఐటిమ్స్)
- ప్రయాణికులకు తొలగనున్న చిల్లర సమస్య
- జిల్లాకు 600 ఐ టిమ్స్ మంజూరు
- ఇప్పటికే సిస్టమ్ సూపర్‌వైజర్లకు శిక్షణ



రామగిరి(నల్లగొండ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా అడుగులు వేస్తోంది. గతంలో ఆర్టీసీ బస్సుల్లో వాడుతున్న టికెట్ ఇష్యూయింగ్ మిషన్ (టిమ్)తో చిల్లర సమస్య తలెత్తేది. ఈ సమస్యలను అధిగమించేందుకు నూతనంగా ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లు (ఐ టిమ్స్) ప్రవేశపెట్టనుంది. నల్లగొండ రీజియన్ వ్యాప్తంగా ఏడు డిపోలు ఉన్నాయి. అన్ని డిపోల్లో టికెట్ ఇష్యూయింగ్ మిషన్ (టిమ్)తో పాటు కొత్తగా ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లు త్వరలో ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే సిస్టమ్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోలు ఉండగా అన్ని డిపోల్లో 600 ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లు అందుబాటులోకి తీసుకురానున్నారు.

నగదు రహిత సేవలు..

జిల్లాలో ప్రయోగాత్మకంగా ముందుగా దేవరకొండ డిపో పరిధిలో 10 ఈ టిమ్స్ మిషన్లను ప్రవేశపెట్టింది. దీంతో పాటు సూర్యాపేట, కోదాడ డిపోల్లో దూర ప్రయాణం చేసే బస్సుల్లో ఈ మిషన్లు వాడుతున్నారు. వీటితో నగదు రహిత సేవలు అందించేందుకు వీలు ఉంది. ఈ మిషన్ల ద్వారా ప్రయాణికులు యూపీఐ ద్వారా గూగుల్ పే, ఫోన్ పేతో పాటు ఏటీఎమ్ కార్డు స్వైపింగ్ తో డబ్బులు చెల్లించి టికెట్ పొందే అవకాశం ఉంది. ఈ టీమ్ సేవలను త్వరలో దశలవారీగా ఇతర బస్సుల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రీజియన్‌లో డిపోల వారీగా మిషన్ల వివరాలు

డిపో	టిమ్‌ల సంఖ్య
కోదాడ	80
నార్కట్‌పల్లి	15
మిర్యాలగూడ	135
దేవరకొండ	90
నల్లగొండ	115
సూర్యాపేట	95
యాదగిరిగుట్ట	70

సేవలు వేగవంతం అవుతాయి



ఆర్టీసీ బస్సుల్లో ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ఉమ్మడి నల్లగొండ రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో మిషన్ల ద్వారా సేవలు అందిస్తాం. యూపీఐ, ఏటీఎం కార్డు ద్వారా టికెట్ తీసుకునే సదుపాయం ఉంది. ఈ మిషన్ ద్వారా బస్సు ప్రయాణించే సమయంలో కూడా సీట్లు ఖాళీగా ఉంటే టికెట్ తీసుకునే సదుపాయం ఉంది. ఆర్టీసీ లావాదేవీలు ఎప్పటికప్పుడు తెలిసిపోతాయి.

– జానిరెడ్డి, రీజినల్ మేనేజర్

ప్రయాణికులకు తప్పనున్న ఇబ్బందులు

కండక్టర్ వద్ద చిల్లర లేని సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది. గమ్య స్థానంలో దిగేటప్పుడు ఇద్దరు, ముగ్గురు ప్రయాణికులకు కలిపి డబ్బులు ఇచ్చేవారు. ఇంటెలిజెన్స్ టికెట్ ఇష్యూయింగ్ మిషన్లతో చిల్లర సమస్యకు చెక్ పడనుంది.

జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

- యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వెంకట్రావ్


ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. శుక్రవారం యాదగిరి కొండపైన గల తన కార్యాలయంలో ఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వివిధ శాఖలు, ఎస్పీఎఫ్ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీన ఉదయం స్వస్తి వాచనంతో శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, లక్ష కుంకుమార్చన, తిరు వెంకటపతి అలంకార సేవ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం, గరుడ వాహనంపై పరవాసుదేవ అలంకార సేవ నిర్వహిస్తామన్నారు. 10వ తేదీన ఉదయం లక్ష పుష్పార్చన పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కాళీయ మర్థన అలంకార సేవను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరామావతార అలంకార సేవను ఊరేగించనున్నట్లు వెల్లడించారు. 11వ తేదీన మహా పూర్ణాహుతి చేసి, సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7గంటలకు విశేష తిరువారాధన, అర్చన, వేద స్వస్తీ, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠితో ఉత్సవ సమాప్తి ఉంటుందని పేర్కొన్నారు. శ్రీస్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 11 వరకు ఆలయంలో భక్తులచే జరిపించే నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవను రద్దు చేసినట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి సారిస్తా

వేసవిలో భక్తులు శ్రీస్వామి వారి చెంతకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చలువ పందిర్ల ఏర్పాటు, మంచి నీటి సౌకర్యం కల్పించే అంశాలపై దృష్టి సారిస్తామని ఈఓ వెంకట్రావ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు యాదగిరి క్షేత్రాన్ని సైతం ఈ నెల 15వ తేదీన సందర్శించనున్నట్లు, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న టూరిజం అధికారులు

నాగార్జునసాగర్ : మిస్ వరల్డ్ పోటీదారులు ఈ నెల 12న నాగార్జునసాగర్‌కు రానుండటంతో శుక్రవారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైందని బుద్ధవనం ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి తెలిపారు. బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని ఈనెల 12వ తేదీన మిస్‌వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్‌ను సందర్శించనున్న సందర్భంగా సాగర్‌లోని విజయ్‌విహార్, బుద్ధవనంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్‌వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ కు తీసుకువచ్చే ఓల్వో బస్సులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు శుక్రవారం ఒక బస్సును టూరిజం అధికారుల పర్యవేక్షణలో నాగార్జునసాగర్‌కు తీసుకువచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఈ బస్సు మొదటగా మిస్‌వరల్డ్ పోటీదారులు బస చేసే విజయ్‌విహార్ అతిథి గృహం, బుద్ధవనం చేరుకొని ఆ తరువాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లింది. ఈ సందర్భంగా ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మిస్‌వరల్డ్ పోటీదారులను హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు లగ్జరీ బస్సులో తీసుకువచ్చి తిరిగి వెళ్లే ప్రక్రియలో ఎంత సమయం పడుతుంది, అంతరాయం లేకుండా ఉండే రూట్ మ్యాప్ కోసం శుక్రవారం ట్రయల్‌రన్ చేసినట్లు తెలిపారు. ట్రయల్‌రన్‌లో టూరిజం ఎస్ఈ భాస్కర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ సంపత్‌గౌడ్, ఆర్ఐ దండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు అస్వస్థత

- వాహనాన్ని వెంటనే పక్కకు నిలిపివేయడంతో తప్పిన ప్రమాదం

ఆలేరు: ఆర్టీసీ బస్సు నడుపుతుండగా డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతను వెంటనే బస్సును పక్కకు నిలపడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. శుక్రవారం జనగాం డిపోకు చెందిన ఏపీ 29 జెడ్ -1715 నంబర్ గల ఆర్టీసీ బస్సు జనగాం నుంచి ఉప్పల్ క్రాస్ రోడ్‌కు బయలుదేరింది. ఈక్రమంలో ఆలేరు బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని సుమారు మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరింది. బస్సు ఆలేరు శివారు దాటగానే డ్రైవర్ లక్ష్మయ్య అస్వస్థతకు గురయ్యాడు. తనకు కళ్లు తిరుగుతున్నాయని చెబుతూనే స్టీరింగ్ మీదకి వాలాడు. ఈ క్రమంలోనే అతను అప్రమత్తమై బస్సు డివైడర్ మీదకి దూసుకెళ్లకుండా బ్రేక్ వేసి బస్సును వెంటనే ఆపివేశాడు. దీంతో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కండక్టర్ జనగాం డిపోకు చెందిన బచ్చన్నపేట-జేబీఎస్ ఆర్టీసీ బస్సును ఆపి, ప్రయాణికులను అందులోకి ఎక్కించాడు. ఎండల తీవ్రత కారణంగా డ్రైవర్‌కు వడదెబ్బ తగిలి, కళ్లు తిరిగి ఉంటాయని ప్రయాణికులు తెలిపారు.

రైతు సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా గుత్తా మోహన్‌రెడ్డి


గుత్తా మోహన్‌రెడ్డి

చిట్యాల: చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి తెలంగాణ రైతు సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమాఖ్య ఎన్నికల్లో ఆయనను ఎన్నికయ్యారు. మోహన్‌రెడ్డి 1978లో ఎన్‌జీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేసి మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేయడంతో పాటు 1978, 1985లో నల్లగొండ శాసన సభ నియోజకవర్గ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా గుత్తా మోహన్‌రెడ్డి ఎన్నిక కావటం పట్ల పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రా ధాన్యం లారీల పట్టివేత

మిర్యాలగూడ : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వస్తున్న ఆరు ధాన్యం లారీలను వాడపల్లి అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన క్యాంపు సిబ్బంది గురువారం ఐదు లారీలను, శుక్రవారం ఒక లారీని పట్టుకున్నారు. ఒక్కో లారీలో సుమారు 300 క్వింటాళ్ల ధాన్యం ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆంధ్రాలోని నర్సారావుపేట, ప్రకాశం, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి తెలంగాణకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గతంలో చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యం లారీలను పట్టుకొని తిప్పి పంపేవారు. ఇప్పుడు లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తున్నారు. ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారా లేక కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు తీసుకొస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీలను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని ధాన్యం ఎక్కడకు తరలిస్తున్నారే విషయాన్ని తేలుస్తామని వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ప్రమాదవశాత్తు నదిలో మునిగి విద్యార్థి మృతి


లోకేష్ (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : వేసవి సెలవులు రావడంతో ఈత నేర్చుకునేందుకు కృష్ణా నదికి వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీ గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్వర్లు కొడుకు లోకేష్ (16) కోదాడలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన అతను కృష్ణానదిలో (ప్రాజెక్టు వెనుక జలాల్లో) ఈత నేర్చుకునేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. నడుముకు డబ్బా కట్టుకుని నీటిలోకి దిగాడు. డబ్బా ఊడి పోవడంతో నీటిలో మునిగి పోయాడు. అక్కడ ఉన్నవారు గమనించి గాలించి అతడిని బయటకు తీశారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు.

యాదగిరికొండపై ఆర్టీసీ బస్సు బ్రేక్‌డౌన్


బస్సుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్

యాదగిరిగుట్ట: యాదగిరికొండపై ఆర్టీసీ బస్సు బ్రేక్‌డౌన్ అయింది. శుక్రవారం సాయంత్రం సమయంలో కొండ కింద నుంచి భక్తులను ఎక్కించుకొని కొండపైకి వస్తున్న సమయంలో స్వాగత తోరణం వద్ద బస్సు ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సు వెనక్కి వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో డిపోలోని గ్యారేజీలో ఉన్న మెకానిక్‌లు వచ్చి బస్సుకు మరమ్మతులు చేశారు.

పరారైన జీవిత ఖైదీ అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : పెరోల్‌పై వచ్చి, గత ఆరు సంవత్సరాలుగా తప్పించుకొని తిరుగుతున్న జీవిత ఖైదీని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. శుక్రవారం సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. కోదాడ పోలీస్ డివిజన్ మఠంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు తిరుపతి 2012లో రాచకొండ (అప్పటి సైబరాబాద్) కమిషనరేట్ లోని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టయ్యాడు. ఈమేరకు 2015లో రంగారెడ్డి జిల్లా మూడవ అదనపు సెషన్ కోర్టు సదరు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. దీంతో అతడిని చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా.. 2019 ఆగస్టు 17న ముప్పై రోజుల పెరోల్ పై విడుదలయ్యాడు. పెరోల్ అనంతరం తిరిగి చర్లపల్లి జైలుకు వెళ్లకుండా గత ఆరు సంవత్సరాల నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ నివేదిక ఆధారంగా మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా నిందితుడు గుంటూరు జిల్లాలో ఉన్నట్లు నిర్ధారించారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ ప్రత్యేక బృందం నిందితుడు బొడ్డు తిరుపతిని గుంటూరు పట్టణంలో అరెస్ట్ చేశారు. నిందితుడు తన స్వగ్రామం, కుటుంబ సభ్యుల నుంచి పూర్తిగా బంధాలను ఆపేసి గుంటూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే ఓ మహిళను వివాహం చేసుకొని స్థిరపడినట్లు తెలిపారు. ఈ కేసు ఛేదించి నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

స్వర్ణగిరిలో తిరునక్షత్ర వేడుకలు


పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీరామానుజచార్యులకు నవకలశ పూర్వక పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శ్రీస్వామివారికి సుప్రబాత సేవ, తోమాలసేవ చేపట్టారు. స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణ వేడుక చేపట్టారు. వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లిలో శుక్రవారం జరిగిన వారం సంతకు వచ్చిన పలువురు ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి వెళ్తుండగా పల్లె ప్రకృతి వనం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన బొప్పని మారయ్య (75) అక్కడికక్కడే మృతి చెందాడు. మహిళ, ఆటో డ్రైవర్, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని గోల్డెన్ సిటీ వెంచర్ వెనక వైపు గల వ్యవసాయ పొలంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు, మూడు రోజులుగా పట్టణంలోనే తిరుగుతున్నాడని, మృతి చెందిన విషయాన్ని పశువుల కాపరులు గుర్తించి సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే హుజూర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

డీసీఎం ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

నూతనకల్ : డీసీఎం బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని దిర్శనపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. దిర్శనపల్లి తండాకు చెందిన బదావత్ వివేకానంద్, బాణోతు రాజేష్, బాణోతు సాయిలు ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తమ బంధువుల శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి తండాకు వెళ్తున్న సమయంలో దిర్శనపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో మహబూబాబాద్ జిల్లా బంగ్లా వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంతో వారి బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బదావత్ నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చందుపట్ల చెరువులో అస్థిపంజరం లభ్యం

చివ్వెంల(సూర్యాపేట) : చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామ శివారులోని ఊర చెరువులో అస్థిపంజరం లభ్యమైంది. శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువులో పనులు చేస్తున్న కూలీలకు అస్థిపంజరం కనిపించింది. దీంతో స్థానిక పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించగా, ఆయన పోలీసులకు తెలిపారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎవరైనా హత్య చేసి పడేశారా? లేక నీరు ఉన్నప్పుడు ఎవరైనా చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్షలకు అనువైన సమయమిదే..

- గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ సూచనలు


మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు



నడిగూడెం: ప్రస్తుతం రబీ సీజన్ పూర్తయ్యింది. ఈ సమయంలోనే రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించాలని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించాలని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం మృత్తికా విభాగం శాస్త్రవేత్త ఎ. కిరణ్ చెబుతున్నారు. భూసార పరీక్షలపై ఆయన సలహాలు, సూచనలు..

- పొలం నుంచి సేకరించిన మట్టిని భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి దాని భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకొని ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష లక్ష్యం.
- పంట కోత తర్వాత పొలాల్లో నుంచి మట్టి తీయవచ్చు.
- వేసవిలో పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించవచ్చు.
- ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి నమూనాలు తీయరాదు.
- నీరు పెట్టిన తర్వాత, నీడపడే ప్రదేశాలు, నీటి ముంపు ప్రాంతాలు, పెంట కుప్పల దగ్గర, గట్లు, చెట్లు, రోడ్ల దగ్గర తీయరాదు.
- ఒక రకం పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం మరీ పెద్దయితే ప్రతి ఐదెకరాలకు ఒక నమూనా తీయాలి.
- నేల నిర్మాణం, రంగు, మురుగు, నీటి పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, గుణాలు, పంటల సరళి మొదలగు విషయాల్లో ఏదైనా తేడా కన్పిస్తే అన్ని నమూనాలు ఆ పొలం నుంచి తీయాల్సి ఉంటుంది.
- పైరు పంటలకు భూమిలో 6 అంగుళాలు లోతులో మట్టి నమూనాలు సేకరించాలి.
- పండ్ల తోటల్లో 5 నుంచి 6 అడుగుల వరకు ప్రతి అడుగుకు ఒక నమూనా తీయాలి.
- కారి, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.
- నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసివేసి మట్టి నమూనాలు సేకరించాలి.
- గడ్డపార లేదా పారతో గొయ్యి తీసి దాని అంచుల నుంచి పారతో లేదా తాపీతో మట్టిని సేకరించాలి.
- పొలంలో 8 నుంచి 10 స్థలాల నుంచి మట్టిని తీయాలి.
- సేకరించిన మట్టినంతటిని కలిపి నేలపై పరచి దానిని 4 భాగాలు చేయాలి.
- మూలలకు ఎదురెదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి.
- ఈ విధంగా 500 గ్రాముల మట్టి నమూనాలను సేకరించాలి.
- ఈ అరకేజీ మట్టిని గుడ్డ సంచిలో లేదా పాలిథిన్ సంచిలో వేసి, రైతు పేరు, చిరునామానా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటలు, గత 3 సంవత్సరాలుగా వాడుతున్న ఎరువులు, రాబోయే సీజన్‌లో వేయాల్సిన పంటలు, సేకరించిన తేదీ మొదలగు వివరాలను జతచేయాలి.
- ఈ సమాచారంతో కూడిన మట్టి నమూనాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. లేదా గడ్డిపల్లి కేవీకేకు పంపించినా పరీక్షలు చేసి, సాయిల్ హెల్త్‌కార్డు పంపిణీ చేస్తారు.

2. భూసార పరీక్షల వలన ఉపయోగాలు

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చో, ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేల సమస్యలు తెలుస్తాయి. దాని ప్రకారం ఎరువులను ఉపయోగించవచ్చును.
- ఎరువుల అనవసరపు ఖర్చు తగ్గించవచ్చు.
- సరైన సమయంలో భూసార పరీక్షలు చేయిస్తే సేంద్రియ ఎరువులను కూడా ఉపయోగించి నాణ్యమైన పంటలను పండించవచ్చు.